

కథనం.. కదిలించింది!

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 3 సంచిక -108 గురువారం 1 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -7 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## అదనపు డిక్లరేషన్ అవసరం లేదు



**'సర్'పై వివాదం వేళ.. ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం**

**కొత్త ఓటర్లకు తల్లిదండ్రుల వివరాలు అక్కర్లేదు**

**తాతలు, నానమ్మల వివరాలూ అవసరం లేదు**

**సర్ కొనసాగుతున్న చోట పాత నిబంధనే**

**ఫారం-6 ద్వారా కొనసాగనున్న నిరంతర నమోదు**

**ఢిల్లీ సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):**
కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారికి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక మార్పు చేసింది. 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ' (సర్) పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో **మిగతా 2లో...**

## రబీ పంటల మద్దతు ధర పెంపు



**రబీ పంటల ఎంఎస్‌పీ పెంపునకు కేంద్రం ఆమోదం**

**కుసుమకు అత్యధికంగా రూ.675 పెంపు**

**ఆవాలకు రూ.413, గోధుమకు రూ.25 చొప్పున పెంపు**

**3,715 లక్షల టన్నులకు పెరిగిన గోధుమ సేకరణ**

**ఆరు రబీ పంటలకు రూ.8.36 లక్షల కోట్ల మద్దతు ధర**

**ఢిల్లీ సెప్టెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):**
రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027-28 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి అన్ని రబీ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)**మిగతా 2లో...**



## ఏపీలో సర్ గడువు పొడిగింపు..

**అక్టోబర్ 10 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం**

**అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**

**అర్హులైన ఏ ఒక్క ఓటరు మిగిలిపోకూడదనే ఈ నిర్ణయం**

**కొత్త తేదీలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు ఆదేశం**

**అమరావతి సెప్టెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న **మిగతా 2లో...**

# 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం.

## కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు





**సిరిసిల్లకు రూ.1,500 కోట్ల కేటాయింపు**

**కాంగ్రెస్ నేతకు మంత్రి పదవి హామీ**

**బతుకమ్మ చీరలపై కమీషన్ల ఆరోపణలు**

**దళితుల అంశంలో బీఆర్ఎస్‌పై విమర్శలు**

**సిరిసిల్ల సెప్టెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):**
సిరిసిల్లలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ **మిగతా 2లో...**

## బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలి

**'ఇండియా' కూటమి 6 కీలక డిమాండ్లు**




**పాత ఓటర్ల జాబితానే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్**

**ఓటర్ల జాబితా మార్పుల్లో పూర్తి పారదర్శకత ఉండాలని సూచన**

**ఓటరు తొలగింపుపై కారణాలు, అప్పీల్ అవకాశం కల్పించాలని డిమాండ్**

**ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలన్న 'ఇండియా' కూటమి**

**ఈసీపై అన్ని రాజకీయ పక్షాలకు విశ్వాసం కలగాలని వ్యాఖ్య**

**ఢిల్లీ సెప్టెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):**
ఎన్నికల సంఘం (ఈసీ) వ్యవహరిస్తున్న తీరుపై ఇండియా కూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈసీ వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టేందుకు కూటమి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు.
భవిష్యత్ ఎన్నికల్లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' కు ముందు ఉన్న ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకోవాలని ఇండియా కూటమి **మిగతా 2లో...**



### కాంగ్రెస్‌ను వీడిన వారంతా

## వెనక్కి రావాలి

**జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి**

**సీఎంతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ**

**నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య**

**గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం**

**హైదరాబాద్ సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):**
వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి.**మిగతా 2లో...**

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు



**తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించకూడదన్న కేటీఆర్**

**నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న**

**తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా**

**హైదరాబాద్ సెప్టెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):**
పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ **మిగతా 2లో...**

## యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం




**క్వాంటమ్ నుంచి ఉద్యోగాల వరకు.. ఏపీ భవిష్యత్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు**

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమన్న మంత్రి లోకేశ్**

**అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన**

**పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ**

**కొచ్చి సెప్టెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):**
యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల **మిగతా 2లో...**

## రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి



**సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ**

**రాజస్థాన్‌కు 800 మెగావాట్ల విద్యుత్ కేటాయింపుపై తీవ్ర అభ్యంతరం**

**తెలంగాణ వనరులతో ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడమేంటని ప్రశ్న**

**రాష్ట్రంలో రైతులు కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ**

**హైదరాబాద్ సెప్టెంబర్ 30(జర్నలిస్ట్ వార్త):**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. సింగరేణి నుంచి రాజస్థాన్‌కు విద్యుత్ సరఫరా చేసేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగ నిర్వహణలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. **మిగతా 2లో...**

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# అదనపు డిక్లరేషన్ అవసరం లేదు

**మొదటిపేజీ తరువాయి**

కొత్త ఓటర్లు ఇక తల్లిదండ్రులు, తాతలు, నానమ్మల ఓటరు జాబితా వివరాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఈ మేరకు ఫారం-6లో మార్పులు చేసింది. ఇప్పటివరకు కొత్త ఓటరు పేరు ఓటర్ల జాబితాలో చేర్చేందుకు సాధారణ ఫారం-6 సరిపోయేది. అయితే 'సర్' ప్రక్రియ సమయంలో ఫారం-6తో పాటు అదనపు డిక్లరేషన్ తీసుకున్నారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాతో తమ కుటుంబానికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించేందుకు తల్లిదండ్రులు లేదా తాతల వివరాలు ఇవ్వాలని అందులో కోరారు.

'సర్' పూర్తయిన రాష్ట్రాల్లో ఇప్పుడు ఈ అదనపు డిక్లరేషన్ అవసరం ఉండదు. బిహార్, పశ్చిమ బెంగాల్ సహా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ పూర్తయిందని ఈసీ తెలిపింది. సర్ సమయంలో పేరు జాబితాలో లేని వారు, అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన యువత, తొలిసారి ఓటు వేయబోయే వారు నిరంతర అప్‌డేషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం ఈ నిబంధన కొనసాగుతుంది. అక్కడ కొత్త ఓటర్లు ఫారం-6తో పాటు 'సర్'కు సంబంధించిన డిక్లరేషన్ సమర్పించాల్సి ఉంటుంది. గత ఓటర్ల జాబితాతో తమ సంబంధాన్ని చూపించే వివరాలను కూడా ఇవ్వాలి. ఫారం-6లో మార్పులపై ఈసీలో విభేదాలు ఉన్నట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అదనపు డిక్లరేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఫారం-6, 'సర్'కు సంబంధించిన నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ నిర్ణయాలేనని ఈసీ స్పష్టం చేసింది. సెప్టెంబర్ 26న విడుదల చేసిన వివరణలో సర్ డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీ పేర్కొంది. సర్ పూర్తయిన ప్రాంతాల్లో, అలాగే ఇంకా ప్రారంభం కాని ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్ అవసరం లేదని తెలిపింది. తాజా మార్పుతో సర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్త ఓటర్లు ఇక సాధారణ ఫారం-6 ద్వారానే నమోదు చేసుకోవచ్చు. అదనంగా కుటుంబానికి సంబంధించిన పాత ఓటర్ల జాబితా వివరాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు.

# బ్యాలెట్ పేపర్ విధానం అమలు చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

కోరింది. ఓటర్ల జాబితాలో జరిగే ప్రతి మార్పుపై పూర్తి పారదర్శకత ఉండాలని చెప్పింది. నియోజకవర్గం, పోలింగ్ బూత్ వారీగా చేర్పులు, తొలగింపులు, సవరణల వివరాలను బహిరంగంగా ఉంచాలని డిమాండ్ చేసింది. ఓటరును జాబితా నుంచి తొలగించే ముందు కారణాలను తెలియజేయాలని కూటమి కోరింది. అలాంటి నిర్ణయంపై అప్పీల్ చేసుకునేందుకు సమర్థమైన విధానం ఉండాలని పేర్కొంది. పరిపాలనా లోపాలు, తగిన పత్రాలు లేకపోవడం, అవగాహన లేకపోవడం వంటి కారణాలతో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని కోరింది. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని ఇండియా కూటమి డిమాండ్ చేసింది. యువత, తొలిసారి ఓటు వేయబోయే వారికి సులభంగా ఓటరు నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరింది. ఎన్నికల వ్యవస్థలో సంస్థాగత జవాబుదారీతనం పెరగాలని ఖర్గే అన్నారు. అన్ని రాజకీయ పక్షాలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల సంఘం పనిచేయాలని డిమాండ్ చేశారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందని రాహుల్ గాంధీ ఆధారాలతో చూపించారని ఖర్గే ఆరోపించారు. ఈ అంశంపై ఈసీ స్పందించలేదని అన్నారు. పారదర్శకత స్థానంలో రహస్య విధానం రాకూడదని, ఒక్క వ్యక్తికి ఒక ఓటు, ఓటుకు సమాన విలువ అనే సూత్రం బలహీనపడకూడదని ఇండియా కూటమి పేర్కొంది.

# పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా?" అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు.

తెలుగు సినిమాలు పాన్-ఇండియా స్థాయిలో విజయం సాధిస్తున్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

# యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

**జెన్-జీ మార్పు కోరుకుంటోంది**

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

**డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

**అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్**

క్వాంటమ్ టెక్నాలజీ ఊహ కాదని.. ఇది నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ అని లోకేశ్ అన్నారు. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేస్తూ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు.

**విద్యా వ్యవస్థలో సమూల మార్పులు**

విద్యా వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారాలని లోకేశ్ అన్నారు. గత రెండేళ్లలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఏఐ నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కనీసం దశాబ్ద కాలం పడుతుందని పేర్కొన్నారు.

**పెట్టుబడులకు '3ఎస్' మంత్రం**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 3ఎస్ విధానాన్ని అనుసరిస్తున్నామని లోకేశ్ చెప్పారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులకు తెలియజేయడం, ప్రభుత్వాలు మారినా విధానాల్లో స్థిరత్వం ఉండేలా చూడటం తమ విధానమన్నారు. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

# 'సిరిసిల్ల గడీ'ని కూలుస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీని కూల్చుతామని చెప్పి చేసి చూపించామని, ఇప్పుడు సిరిసిల్ల గడీని కూడా నేలమట్టం చేద్దామని సిరిసిల్ల ప్రజలకు పిలుపునిచ్చారు. కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తూ.. 'పిల్లకాకికి ఏం తెలుసు ఉండేలు దెబ్బ' అంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తన విలువ ఏంటో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారి అయ్యను అడిగితే తెలుస్తుందని అన్నారు. గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని సీఎం తెలిపారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడిని భవిష్యత్తులో మంత్రిని చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతూ.. తాను సీఎం అయిన తర్వాత సీతక్క వంటి సామాన్యులకు మంత్రి పదవులు దక్కాయని పేర్కొన్నారు.



**బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లే**

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీఎం విమర్శించారు. టీవీలు, పేపర్లు, స్టార్ హోటళ్లు, ఫామ్‌హౌస్‌లు మాత్రమే సంపాదించుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్‌ను ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకుని కమీషన్లు తీసుకున్నారని, చివరకు బతుకమ్మ చీరల తయారీలోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'పుట్టింటి సారె' పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నామని చెప్పారు.

**దళితులపై చిన్నచూపా?**

అసెంబ్లీలో స్పీకర్‌ను దూషించి అవమానించిన ఘనత బీఆర్ఎస్ నాయకులదేనని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎర్రవల్లిలో దళితులు డప్పు కొడితే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో కడిగి అణగదొక్కారని ఆరోపించారు. దళితులంటే బీఆర్ఎస్‌కు అంత చిన్నచూపా అని ప్రశ్నించారు.

ఎర్రవల్లి భూముల ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుల అక్రమాస్తులపై లెక్కలు తేలుస్తున్నామని సీఎం అన్నారు. 'ఎట్ హోమ్', 'దక్కన్ స్టార్ హోటల్స్' పేరుతో ఉన్న ఆస్తులు వారి పేర్లకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అసెంబ్లీలో సమయం లేక కొన్ని విషయాలు చెప్పలేకపోయామని, త్వరలో 'పార్ట్-2'లో అన్ని వివరాలు బయటపెడతామని ప్రకటించారు.

# కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి

**మొదటిపేజీ తరువాయి**

జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# రబీ పంటల మద్దతు ధర పెంపు

**మొదటిపేజీ తరువాయి**

పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రబీ పంటల్లో కుసుమ మద్దతు ధరను అత్యధికంగా క్వింటాల్‌పై రూ.675 పెంచారు. ఆ తర్వాత ఆవాలకు రూ.413 పెంపు ప్రకటించారు. మసూర్ పప్పుకు రూ.390, బార్లీకి రూ.136, శనగకు రూ.83, గోధుమకు రూ.25 చొప్పున ఎంఎస్‌పీ పెంచారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఈ పెంపు చేసినట్లు కేంద్రం తెలిపింది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 1.5 రెట్ల స్థాయిలో ఎంఎస్‌పీ ఉండేలా చూడాలన్న 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఇటీవలి కాలంలో తృణధాన్యాలతో పాటు పప్పులు, నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రం ఎక్కువ మద్దతు ధర అందిస్తోంది. 2014-15 నుంచి 2025-26 మధ్య గోధుమల సేకరణ 3,715 లక్షల టన్నులకు పెరిగింది. 2004-05 నుంచి 2013-14 మధ్య ఇది 2,254 లక్షల టన్నులుగా ఉంది. ఆరు రబీ పంటల సేకరణ కూడా ఇదే కాలంలో 3,921 లక్షల టన్నులకు చేరింది. గతంలో ఇది 2,302 లక్షల టన్నులుగా ఉండేది. గోధుమ రైతులకు 2014-15 నుంచి 2025-26 మధ్య మద్దతు ధర రూపంలో రూ.7.31 లక్షల కోట్లు చెల్లించారు. 2004-05 నుంచి 2013-14 మధ్య చెల్లించిన రూ.2.56 లక్షల కోట్లతో పోలిస్తే ఇది ఎక్కువ. ఆరు రబీ పంటలు పండించే రైతులకు ఇదే కాలంలో రూ.8.36 లక్షల కోట్లు ఎంఎస్‌పీగా చెల్లించగా.. అంతకుముందు కాలంలో రూ.2.65 లక్షల కోట్లు చెల్లించారు.

# ఏపీలో సర్ గడువు పొడిగింపు..

**మొదటిపేజీ తరువాయి**

పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం.

కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా నో-మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

# రాజస్థాన్‌తో ఒప్పందం రద్దు చేయండి

మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా ఉత్పత్తి అయ్యే 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు చెందిన సంస్థకు కేటాయించడంపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సింగరేణి గనుల నుంచి, నీరు గోదావరి నది నుంచి సేకరిస్తున్నారని, అలాగే భూమి కూడా తెలంగాణదేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర వనరులతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను మన అవసరాలకు వినియోగించకుండా వేరే రాష్ట్రానికి కేటాయించడంపై నిలదీశారు. తెలంగాణలో విద్యుత్ కోతలతో రైతుల పంటలు ఎండిపోతుంటే, రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ఇవ్వడానికి సిద్ధపడటం దారుణమని హరీశ్ రావు అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు కనీసం 7-8 గంటలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని తన లేఖలో స్పష్టం చేశారు.

**సిరిసిల్ల ఏమైనా శత్రు రాజ్యమా..? : హరీశ్ రావు**

కేటీఆర్ రాకముందు సిరిసిల్ల ఎట్లుంటే.. కేటీఆర్ ఎమ్మెల్యే అయిన తర్వాత ఎట్లా మారిందో ఆ సిరిసిల్ల ప్రజలను అడుగు.. వాళ్లు చెప్తరని రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తనదైన స్టైల్‌లో చురకలంటించారు. లీడర్లు ఎక్కడికైనా ఎందుకు పోతరు.. ఒక ముఖ్యమంత్రి ప్రజలకు సేవ చేయాలి. ఈయన దండయాత్రకు పోతడట.. దండయాత్ర చేయడానికి ఏమైనా శత్రు రాజ్యమా..? యెనకట రాజులు పక్క దేశం మీద దండయాత్ర చేస్తుండేవాళ్లు. సిరిసిల్ల తెలంగాణలో లేదా..? అని ప్రశ్నించారు. 4 వేల మంది పోలీసులు.. పొద్దున 4 గంటల నుంచి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను, ఉద్యమకారులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో పెడుతున్నారు. దేనికోసం పోతున్నవ్ సిరిసిల్లకు. బీఫోర్ కేటీఆర్.. ఆఫ్టర్ కేటీఆర్ ఏందో ఒక్కసారి సిరిసిల్ల ప్రజలను అడగండి వాళు చెప్తరని హరీశ్ రావు హితవు పలికారు. ఎంత ఆదర్శంగా.. ఎంత అద్భుతంగా సిరిసిల్ల తయారైందో.. కేటీఆర్ రాకముందు సిరిసిల్ల ఎట్లుంటే.. కేటీఆర్ ఎమ్మెల్యే అయిన తర్వాత ఎట్లా మారిందో ఆ సిరిసిల్ల ప్రజలను అడుగు.. వాళ్లు చెప్తరని రేవంత్ రెడ్డికి సూచించారు.

నువ్వు బయట నుంచి కొంతమంది గూండాలనో, కార్యకర్తలనో, సివిల్ డ్రెస్‌లో పోలీసోళ్లను పెట్టుకొని పోయినంత మాత్రాన సిరిసిల్ల ప్రజల తలరాతలు మారవన్నారు. సిరిసిల్ల ఆదర్శనియోజకవర్గం అయిందంటే.. అక్కడున్నరైతులకు కాళేశ్వరం జలాలు వచ్చినయంటే.. మానేరు మీద చెక్‌డ్యామ్‌లు వచ్చినయంటే..సిరిసిల్ల మున్సిపాలిటీ ఆదర్శంగా అభివృద్ధి జరిగిందంటే.. దాని వెనుక కేటీఆర్ కృషి ఉంది. నిజంగా నువ్వు ప్రజల మనసు గెలవాలంటే మేం పని చేసినదానికంటే ఎక్కువ పని చేయ్.. ఎక్కువ పథకాలు ఇయ్యు.. ఎక్కువ డబ్బులు ఇచ్చి ప్రజల మనసు గెలవాలి కానీ.. పోలీసోళ్లనో, గూండాలనో పెట్టుకొని దండయాత్ర చేస్తానంటే..నీ చౌకబారు మాటలను ప్రజలు హర్షించరు.

నువ్వు సిరిసిల్లలో నేర్చుకొని రా.. చేనేత కార్మికులకు కేసీఆర్, కేటీఆర్ ఏం చేశారో..? ఆ వరుస చెక్‌డ్యామ్‌లు కడితే ఆ మానేరు పరిసర ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో అద్భుతమైన పంటలు ఎట్లా పండినయో. చూసి నేర్చుకొరా రేవంత్ రెడ్డి.. ఇది రాష్ట్రానికి ఉపయోగపడ్తదన్నారు హరీశ్ రావు.

# ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు.. సీఎం రేవంత్ రెడ్డి అభినందన

ఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు.

ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.

## ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు



**సంగెం/ సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ వార్త):** మొండ్రాయి గ్రామంలోని ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి జగదీష్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని నిల్వలను పరిశీలించి ఉత్పత్తుల నాణ్యత, గడువు తేదీ, బ్యాచ్ నంబర్, లైసెన్సులు, విక్రయ రికార్డులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నకిలీ లేదా గడువు ముగిసిన ఉత్పత్తులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు లేబుల్, తయారీగడువు తేదీలు, బ్యాచ్ నంబర్, నాణ్యత వివరాలను పరిశీలించాలని సూచించారు. అధీకృత దుకాణాల్లోనే కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన పురుగుమందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారి తెలిపారు.

## మామునూరు విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలి

### మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు






**వర్ధన్నపేట/సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ వార్త):** మామునూరు విమానాశ్రయానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు మాదిగ డిమాండ్ చేశారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో బుధవారం ప్రజా సంఘాల నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ పేరు పెట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను గుర్తిస్తూ మామునూరు విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏంఆర్ పి ఎస్ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ, బీసీ సంక్షేమ సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ కార్యదర్శి మామిండ్ల చెన్నయ్య యాదవ్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నర్సయ్య మాదిగ, వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ జంగిలి భాస్కర్ మాదిగ, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## కిట్స్ వరంగల్‌లో మెగా రక్తదాన శిబిరం

### 466 యూనిట్ల రక్తదానం.. సామాజిక బాధ్యతను చాటుకున్న విద్యార్థులు

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** కిట్స్ వరంగల్ ఆడిటోరియంలో జాతీయ సేవా పథకం, విద్యార్థి కార్యకలాపాల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. హనుమకొండ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, లయన్స్ క్లబ్ వరంగల్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో కిట్స్ వరంగల్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని 466 యూనిట్ల రక్తాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేశారు.

రక్తదానం చేయడం ద్వారా విద్యార్థులు సామాజిక బాధ్యతను చాటుకున్నారని లయన్స్ క్లబ్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు వెంకటేశ్వర్లు అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

కిట్స్ వరంగల్ కోశాధికారి, లయన్స్ క్లబ్ వరంగల్ చార్టర్ సభ్యుడు పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ అవసరంలో ఉన్నవారికి రక్తదానం చేయడం అత్యున్నత సేవా కార్యక్రమమన్నారు. సాంకేతిక విద్యతో పాటు మానవ ప్రాణాలను కాపాడే సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ కిట్స్ వరంగల్ ముందుంటోందని తెలిపారు. ఒక్క చుక్క రక్తం ఒక ప్రాణాన్ని కాపాడగలదని పేర్కొన్నారు.

కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం కొరత లేకుండా స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించాల్సిన




అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రక్తదానం, స్వచ్ఛ భారత్, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదానం చేయడానికి కొన్ని నిమిషాల సమయం పట్టినా, అది మరొకరి జీవితాన్ని కాపాడగలదని అన్నారు. శిబిరం నిర్వహణకు ఆర్థిక సహకారం అందించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు, అదనపు కార్యదర్శి వొడితల సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి కె.విష్ణుకుమార్ గుప్తా, కోశాధికారి పాడిరే కీర్తితేజరెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, ఐఆర్‌సీఎస్ హనుమకొండ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్‌రెడ్డి, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిహెచ్.సతీష్‌చంద్ర, అదనపు ప్రోగ్రాం అధికారి ఎస్.భార్గవి, డీన్ విద్యార్థి వ్యవహారాలు ప్రొఫెసర్ కె.శ్రీధర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్‌రెడ్డి, పరిపాలనాధికారి ప్రొఫెసర్ పి.రమేష్‌రెడ్డి, వైద్య బృందం డాక్టర్ సుష్మిత, అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థి ప్రతినిధులు, వివిధ క్లబ్‌ల ప్రతినిధులు, 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు చిరు సత్కారం




**సత్తుపల్లి/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో అంగన్ మిలన్ సేవా కార్యక్రమాన్ని సత్తుపల్లి మండలంలోని యాతాలకుంట, చెరుకుపల్లి, రేగళ్లపాడు, జగన్నాధపురం గ్రామాల్లో నిర్వహించారు. మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ ఆధ్వర్యంలో, జిల్లా కార్యవర్గ సభ్యులు చీకటి వసంతరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సాలి శివకృష్ణ, ఎస్.కె. రహమతుల్లా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, టీకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలను చిరు సత్కారంతో అభినందించారు. ఆరోగ్యవంతమైన తల్లిఆరోగ్యవంతమైన బిడ్డబలమైన భారత్ లక్ష్యంతో ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ పింగళి వెంకటరెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చినా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పంటల కొనుగోలు వంటి అంశాల్లో అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. పీఏసీఎస్‌లు రైతులకు ఆర్థికంగా, వ్యవసాయపరంగా అండగా నిలిచే కీలక సంస్థలని పేర్కొంటూ, రుణాలు, వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ న్యాయ విభాగం ఉపాధ్యక్షుడు నిమ్మాని శేఖర్‌రావు, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ కుమార్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా బానోత్ వీరన్న

### నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ నాయక్

**కేసముద్రం/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా బిచ్యానాయక్ తండాకు చెందిన బానోత్ వీరన్న నాయక్‌ను నియమించినట్లు ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్ తెలిపారు. బుధవారం మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీరన్న నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వీరన్న నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించేందుకు కృషి చేసిన మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉమ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీతా వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం






రామానాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్‌తో పాటు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ గ్రామాలు, తండాల్లో కాంగ్రెస్ ఎస్టీ సెల్‌ను మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బిచ్యానాయక్ తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ యాకూబ్, రంగాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు భూక్య మాలు, మాజీ సర్పంచ్ గుగులోత్ మంగమ్మ రాములు, బిచ్యానాయక్ తండా 1వ వార్డు సభ్యుడు బాదావత్ మంగీలాల్, సప్పిడిగుట్ట తండా వార్డు సభ్యులు బానోత్ శ్రీను, గుగులోత్ సురేష్ వర్మ, యూత్ కాంగ్రెస్ నాయకుడు తేజావత్ మోహన్, యాకూబ్, ప్రభాకర్, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

### తహసీల్దార్‌కు ఎంసీపీఐ(యూ), ఏఐసీటీయూ వినతి

**కేసముద్రం/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యూ), ఏఐసీటీయూ ఆధ్వర్యంలో బుధవారం కేసముద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు .ఎంసీపీఐ(యూ) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ పేదలకు ఇంటి పట్టాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. వృద్ధులు, వితంతువుల పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.




మహిళలకు నెలకు రూ.2,500, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలన్నారు. భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి, ప్రతి మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు పొందే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి చెల్లించాలని కోరారు. హామీలు అమలు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల వెంకన్న, ఆంగోత్ లక్ష్మణ్, సింగిరెడ్డి కర్ణాకర్, గుగులోతు లక్ష్మణ్, బానోతు ఈసు, గుగులోతు రాజు, గూబ సమ్మయ్య, పందుల ఎల్లమ్మ, వల్లందాస్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## మాక్ పార్లమెంట్‌తో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు

### ప్రజాస్వామ్య విలువలు, ప్రశ్నించే తత్వం పెంపొందుతాయి: ఎంఈఓ ఏ. శ్రీనివాస్

**హసన్‌పర్తి/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి మాక్ పార్లమెంట్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 14 పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

మాక్ పార్లమెంట్‌లో భాగంగా విద్యార్థులు భారత పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్య విధానం, రాజ్యాంగ విలువలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలను ప్రదర్శించారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలు, ప్రశ్నోత్తరాలు, నిర్ణయాల ప్రక్రియను విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, ప్రశ్నించే



తత్వం, నిర్ణయం తీసుకునే సామర్థ్యం, సమయస్ఫూర్తి, మాట్లాడే నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. భవిష్యత్‌లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి సమాజానికి నాయకత్వం వహించేలా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మాక్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులకు పార్లమెంటరీ విధానాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

పోటీల్లో పాల్గొన్న 14 పీఎం శ్రీ పాఠశాలల మార్గదర్శక ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, వనరుల వ్యక్తులు, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ మాక్ పార్లమెంట్ పోటీలు విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి, నాయకత్వ లక్షణాల పెంపొందింపునకు దోహదపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# కళాశాలలో మెగా స్వచ్ఛభారత్




**నర్సంపేట/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల మైదానం, పరిసరాల్లోని గడ్డి, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎం. రాంబాబు మాట్లాడుతూ ప్రజల్లో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణంపై అవగాహన కల్పించడంతో పాటు యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డాక్టర్ సంధ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్య, సీఓఈ కమలాకర్, డాక్టర్ రుద్రాణి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల భద్రతకు పోలీసుల భరోసా

## వేధింపులు, సైబర్ నేరాలపై అవగాహన



**కేసముద్రం/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మహబూబాబాద్ షీ టీమ్ ఎస్ఐ సునంద తెలిపారు. జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్ ఆదేశాల మేరకు కేసముద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ అప్‌గ్రేడెడ్ స్కూల్, జూనియర్ కళాశాలలో బుధవారం మహిళా భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునంద మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, మహిళలపై వేధింపులు, మానవ అక్రమ రవాణా తదితర నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు, షీ టీమ్‌కు 8712656935కు ఫోన్ చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. చదువుకునే వయసులో ప్రలోభాలకు లోనుకాకుండా ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. సుజాత, అధ్యాపక బృందం, సుమారు 550 మంది విద్యార్థినులు, షీ టీమ్ సిబ్బంది రమేష్, సుధారాణి, ప్రియాంక, కేసముద్రం ఏఎస్సై ధర్మానాయక్, మహిళా కానిస్టేబుళ్లు అరుణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ బాధ్యతలకు ముగింపు కాదు.. సేవలకు గుర్తింపు

## 30 ఏళ్ల ఉపాధ్యాయ ప్రస్థానంలో విశిష్ట సేవలు

## ప్రధానోపాధ్యాయుడు ఎర్ర తిరుపతికి ఘన సన్మానం



**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** దామెర గ్రామంలోని ఎస్సీ కాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఎర్ర తిరుపతి అందించిన సేవలు మరువలేనివని గ్రామ సర్పంచ్ మంకని పద్మ, గ్రామస్తులు కొనియాడారు. మూడు దశాబ్దాల ఉపాధ్యాయ ప్రస్థానంలో విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మార్గదర్శకుడిగా ఆయన విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ సాతూరి ప్రేమలత మాట్లాడుతూ తిరుపతి విద్యారంగంలో అంకితభావంతో పనిచేసి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఆయనకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సర్పంచ్ మంకని పద్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

# పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

## ప్రిన్సిపాల్‌కు ఎస్ఎఫ్ఐ వినతిపత్రం



**పరకాల/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** పరకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కళాశాలను సందర్శించి, సమస్యలపై కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులకు తగిన బాత్రూమ్ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. విద్యార్థులు క్రీడలు ఆడేందుకు సరైన మైదానం, మౌలిక వసతులు లేవని, వాటిని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ బాలికల కన్వీనర్ శ్రీ వర్ష, ఎస్ఎఫ్ఐ పరకాల మండల అధ్యక్షుడు రాహుల్, అజయ్, బన్నీతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యాలయంలో మహిళా నేతల సమావేశం



**ఖమ్మం/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** విజయదశమి సందర్భంగా ఖమ్మం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పార్టీ పార్లమెంట్ మహిళా నాయకురాళ్లు సమావేశమై చర్చించారు. అక్టోబర్ 10 నుంచి 14వ తేదీ వరకు ప్రతిరోజూ బతుకమ్మ వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మహిళా నేతలు చుండూరు రాజరాజేశ్వరి, చలసాని ఝాన్సీ, మందపల్లి రజిని, తాడిశెట్టి స్వాతి, రాటకొండ పావని, కామ అనిత తదితరులు పాల్గొన్నారు.

# మురళీకృష్ణ జ్ఞాపకార్థం విద్యార్థులకు నగదు పురస్కారాలు




**వైరా/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కందిబండ బాలమురళీకృష్ణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి శైలజారాణి, కుమారులు రాజేష్, రాకేష్ నగదు పురస్కారాలు అందించారు. వైరా మండలం సిరిపురం ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు ఇంటూరి సూర్యకుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.
గతేడాది పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన ఖమ్మంపాటి ఆదిత్యకు రూ.12 వేలు, ద్వితీయ స్థానం పొందిన ఖమ్మంపాటి యశ్వంత్‌కు రూ.6 వేలు, తృతీయ స్థానం సాధించిన బొడ్డు సాయికి రూ.4 వేలు నగదు అందజేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేసి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, పాఠశాల చైర్మన్ షేక్ బీ.జాన్‌బీ, సామాజిక కార్యకర్త షేక్ లతీఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న శైలజారాణి కుటుంబాన్ని గ్రామస్థులు అభినందించారు.

# జనవరిలో గండి రామారం నీళ్లు!

## రెండో పంటకు సాగునీరు అందించాల్సిందే

## లిఫ్ట్1 పనులు 70 శాతం పూర్తి..

## నెలలో పంప్‌హౌస్ పనులు పూర్తి చేయాలి





**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** గండి రామారం ఎత్తిపోతల పథకం లిఫ్ట్1 పనులను వేగవంతం చేసి జనవరిలోగా రెండో పంటకు సాగునీరు అందించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. లిఫ్ట్1 పనులు ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
చిల్పూర్ మండలం లింగంపల్లి శివారులోని పంప్‌హౌస్ నిర్మాణ పనులను బుధవారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి కడియం శ్రీహరి పరిశీలించారు. పంప్‌హౌస్‌కు సంబంధించిన సివిల్, మోటార్లు, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ చివరి నాటికి పైప్‌లైన్ పనులు పూర్తి చేసి, డిసెంబర్‌లో ట్రయల్ రన్ నిర్వహించాలని సూచించారు.
వేలేరు, చిల్పూర్ మండలాల్లోని ఎత్తయిన ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు రూ.104 కోట్లతో గండి రామారం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. మూడు లిఫ్ట్‌లలో లిఫ్ట్1, 3 పనులు గతంలో నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో పనులు ఆలస్యం కాకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.
నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు రెండు పంటలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని కడియం శ్రీహరి తెలిపారు. దేవాదుల పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి: కలెక్టర్ స్నేహ శబరిష్





**మహబూబాబాద్/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):**
సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలని, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు వంట చేసే సిబ్బందికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించి, నివేదికలను సమర్పించాలని సూచించారు.
ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, గర్భిణులు, శిశువులు, బాలింతలకు టీకాలు నిర్ణీత సమయంలో అందించాలని చెప్పారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రిలోని ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్, మందుల రిజిస్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. సబ్‌సెంటర్ల వారీగా అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, పిల్లలకు టీకాలను టీకా షెడ్యూల్ ప్రకారం వేయాలని సూచించారు. బోదకాలు, గర్భాశయ క్యాన్సర్ నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్ ప్రతి తరగతి గదిని పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని సూచించారు. ఇంటర్మీడియట్ దశలోనే భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పూర్తిగా నమోదయ్యేలా ప్రిన్సిపల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంగ్లిష్‌తో పాటు ప్రతి సబ్జెక్టుపై ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని సూచించారు. పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.
ఈ పర్యటనలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి మదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, నెల్లికుదురు తహసీల్దార్ నరేష్, కళాశాల ప్రిన్సిపల్ వీరస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెం.3కి ప్రత్యామ్నాయ రాజ్యాంగబద్ధ విధానం తీసుకురావాలి

## భూక్య రవి నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి డిమాండ్.



**బయ్యారం/,సెప్టెంబర్ 30.(జర్నలిస్ట్ వార్త)**
ఏజెన్సీ, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజన యువత ఉపాధి అవకాశాలను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే జీవో నెం.3కి ప్రత్యామ్నాయ రాజ్యాంగబద్ధ చట్టపరమైన విధానాన్ని తీసుకురావాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ డిమాండ్ చేశారు. బయ్యారం మండల కేంద్రంలో సేవాలాల్ సేన,గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భూక్య రవి నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో జీవో నెం.3 ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులను 100 శాతం స్థానిక గిరిజనులతోనే భర్తీ చేసే విధానం అమల్లో ఉండేదని,అయితే 2020లో సుప్రీంకోర్టు దీనిని రద్దు చేయడంతో గిరిజన యువత ఉపాధి పరంగా తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గిరిజనుల హక్కులను కాపాడేందుకు ప్రత్యామ్నాయ చట్టపరమైన మార్గాలను వేగవంతం చేసిందని,అదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా స్పందించాలని కోరారు. జీవో నెం.3 యథాతథ పునరుద్ధరణ సాధ్యమా కాదా అనే దానికంటే,న్యాయస్థానం తీర్పుకు లోబడి గిరిజనులకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చే రాజ్యాంగబద్ధ విధానాన్ని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే గిరిజన సంఘాలు,న్యాయ నిపుణులు, అధికారులతో సంప్రదింపులు జరిపి, ఏజెన్సీ ప్రాంత గిరిజన యువతకు ఉపాధి,విద్యా అభివృద్ధి,సామాజిక భద్రత కల్పించేలా కొత్త విధానాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో గిరిజన నాయకులు గోగ్గ కోటయ్య,తాటి వెంకటేశ్వర్లు,అజయ్ నాయక్,భూక్య శేఖర్ నాయక్,చింతల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న పోరాటాలను ఉధృతం చేయాలి

## రైతు కూలీ సంఘాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి

**ఖమ్మం/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీలు, గ్రామీణ పేదల సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్ పిలుపునిచ్చారు. ఖమ్మంలో ప్రారంభమైన సంఘం నాలుగో జాతీయ మహాసభల్లో ఆయన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులు నిర్వహించిన పోరాటాల్లో సంఘం చురుకుగా పాల్గొన్నట్లు తెలిపారు. ఢిల్లీ సరిహద్దులు, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల్లో రైతాంగ ఉద్యమాలను బలోపేతం చేసిందన్నారు. మూడు వ్యవసాయ చట్టాల ఉపసంహరణ కోసం సాగిన పోరాటం ద్వారా పలు రాష్ట్రాల్లో రైతులతో సంఘం సంబంధాలు విస్తరించాయని పేర్కొన్నారు.

**భూ సమస్యలపై నిరంతర పోరాటాలు**

భూమిలేని పేదలు, రైతులు, కౌలు రైతులు, దళితులు, ఆదివాసీల భూ సమస్యలపై బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాల్లో పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. బలవంతపు భూసేకరణ, భూకబ్జాలు, భూదందాలు, ఇసుక అక్రమ రవాణాకు వ్యతిరేకంగా కూడా పోరాటాలు సాగించినట్లు వివరించారు. ఆదివాసీ ప్రాంతాల్లో భూమి, అడవులు, సహజ వనరుల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలతో కలిసి పనిచేసినట్లు తెలిపారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ, గిట్టుబాటు ధర, రుణభారం నుంచి విముక్తి, జీవన భద్రత కోసం పోరాటాలను మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.






**ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలి**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ పేదలకు ఉపాధి, పని దినాలు, వేతనాలు, సామాజిక భద్రత కల్పించేలా మరింత విస్తృత ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వాన్ని పెంచడం, ప్రతి గ్రామంలో సంఘాన్ని ఏర్పాటు చేయడం, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలను బలోపేతం చేయడం ప్రధాన కర్తవ్యాలని డాక్టర్ ఆశిష్ మిట్టల్ తెలిపారు. గత పోరాటాల అనుభవాలను సమీక్షించుకొని కొత్త ప్రాంతాలకు సంఘాన్ని విస్తరించాలని సూచించారు. అనంతరం వివిధ రాష్ట్రాల ప్రతినిధులు నివేదికపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశానికి వేములపల్లి వెంకటరామయ్య, సుశాంత్, జై చలపతిరావు, రవీందర్ సింగ్ తదితరులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

## కమిషనర్ దృష్టికి 8వ వార్డు సమస్యలు



**స్టేషన్ ఘన్‌పూర్/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** 8వ వార్డులోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ పొన్న రాజేష్ తెలిపారు. బుధవారం కమిషనర్ బి.రాధాకృష్ణ, చైర్మన్ వినయ్‌కుమార్, ఏఈ అనిల్‌కుమార్‌లకు వార్డులోని సమస్యలను వివరించారు. అనంతరం అధికారులతో కలిసి వార్డులో పర్యటించి సమస్యలను పరిశీలించారు. వార్డులో పందుల సంచారం, పారిశుద్ధ్యం, తాగునీరు, బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. మంచి నీటి బావికి కప్పు, మినీవాటర్ సిస్టం వద్ద ఫ్లోరింగ్, మురుగు నీటి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పందుల యజమానులకు నోటీసులు జారీ చేసి, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. బతుకమ్మ వేడుకల ప్రాంగణాన్ని చదును చేసి లైటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పాత వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలగాని అనిల్, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# బీజేపీ నిరసనను అడ్డుకున్న పోలీసులు

## సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నం




**స్టేషన్‌ఘన్‌పూర్/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** శ్రీరాముడు, పరమశివుడిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం చిల్పూర్ మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడా రమేష్ పిలుపు మేరకు మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ కాదుగాయ రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరటి రాజు ముదిరాజ్, జిల్లా నాయకులు పెండ్యాల దిలీప్‌కుమార్, బాల్నే శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ముక్కెర రమేష్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కందుకూరు రజినీకర్, మండల నాయకులు కన్నెబోయిన అశోక్‌యాదవ్, అనిల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి



**తల్లాడ/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** 9వ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా తల్లాడ రైతు వేదికలో బుధవారం సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. కల్లూరు ఐసీడీఎస్ సీడీపీవో నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తల్లాడ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

గర్భిణీలు, బాలింతలు తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు లభించే ఆహారం తీసుకోవాలని వారు సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు, గింజలు ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి పద్మ, సూపర్‌వైజర్లు ఎం.రేఖ, కరుణకుమారి, స్రవంతికుమారి, అనిత, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ నిరసన

## హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీయొద్దని నినాదాలు




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శ్రీరాముడు, శివుడిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్మసాగర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఆందోళన చేపట్టారు. బీజేపీ జెండాలు చేతబట్టి నినాదాలు చేశారు. హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయొద్దని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 28న న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి దక్షిణ భారతీయులు శివ భక్తులు, ఉత్తర భారతీయులు రామ భక్తులని వ్యాఖ్యానించారని బీజేపీ నాయకులు తెలిపారు. శ్రీరాముడు ధనికుల దేవుడు, శివుడు పేదల దేవుడని పేర్కొనడం సరికాదన్నారు. కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవాలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్ల మధ్య విభజన రేఖలు గీయొద్దని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైరిపాక కుమార్, మండల ప్రధాన కార్యదర్శి శివ, యువజన నాయకులు శ్యామ్, రఘుదీర్, అమరేందర్‌రెడ్డి, గంకిడి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం సహించం

## గ్రాస్ కటింగ్ మిషన్లు ప్రారంభించిన చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ నాయక్




**మహబూబాబాద్/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** పట్టణ పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, కమిషనర్ ఎం. వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నూతన గ్రాస్ కటింగ్ మిషన్లను ప్రారంభించారు. రోడ్లు, ప్రధాన కూడళ్లు, పచ్చిక ప్రాంతాల్లో పరిశుభ్రత నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.

**విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు?:** పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు విధుల్లో తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, మద్యం సేవించి విధులకు హాజరుకావడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ వాహనాలను జాగ్రత్తగా వినియోగించాలని, ఉద్దేశపూర్వకంగా వాహనాలకు నష్టం కలిగిస్తే సహించబోమన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది ప్రైవేటు వ్యక్తుల ఇళ్లలో వ్యక్తిగత పనులు చేయకూడదని స్పష్టం చేశారు. సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకుశావలి, వెహికల్ ఇంచార్జ్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీహరి, కరుణాకర్, జవాన్లు శ్రీను, కృష్ణ, చిరంజీవి, శ్రీను, మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాదిగ యువసేన జిల్లా అధ్యక్షుడిగా బెన్సన్



**హనుమకొండ/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** మాదిగ యువసేన (ఎంవైఎస్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మునిగాల బెన్సన్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల శివరాం మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ ఆదేశాల మేరకు, ఎంవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉపేందర్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎడ్ల ఉపేందర్ మాట్లాడుతూ తెలంగాణలో నిరుద్యోగ యువతకు అమలు చేస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి, రాజీవ్ యువ వికాసం పథకాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల విల్సన్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరు ఆశీర్వాదం మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎడ్ల సమ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరపు సారన్న, జనగామ జిల్లా ఇన్‌చార్జి రాడపాక భూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ వేణు, పెరుమాండ్ల సాయిరాం, దాట్ల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# కూలిన ఇంటి శిథిలాల తొలగింపునకు నోటీసు

## ప్రమాద నివారణకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన బాధితురాలు



**కేసముద్రం/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు లక్ష్మీనగర్‌లో చారి వెంకటమ్మకు చెందిన ఇల్లు పూర్తిగా దెబ్బతింది. ఇంటి పైకప్పు, గోడలు కూలిపోవడంతో శిథిలాలు ప్రమాదకరంగా మారాయి. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, శిథిలాలను వెంటనే తొలగించాలని వెంకటమ్మకు నోటీసు జారీ చేశారు. శిథిలాల వద్దకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారుల సూచనలకు స్పందించిన వెంకటమ్మ, ప్రజల రక్షణ కోసం ప్రమాదకర ప్రాంతం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, సురక్షిత మార్గంలో వెళ్లాలని హెచ్చరించారు. ప్రజల భద్రతపై ఆమె చూపిన బాధ్యతను వార్డు వాసులు అభినందించారు.

# పేద కుటుంబాలకు ఉచిత ఎగ్ కార్డుల పంపిణీ




**పర్వతగిరి/సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ వార్త):** ఏనుగల్లు గ్రామంలో పేద కుటుంబాలకు ఉచితంగా ఎగ్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు హాజరై లబ్ధిదారులు మహమ్మద్ రఫీ, మహమ్మద్ ముస్తఫాలకు ఎగ్ కార్డులను అందజేశారు. పేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నె రవీందర్, తొర్రి లక్ష్మణ్ యాదవ్, వక్కల రాజు యాదవ్, కాంటెస్ట్ సర్పంచ్ శీలం నాగరాజ్ యాదవ్, రహీం, ఈసుబు, తీస్ వేణు, ధోని దేవేందర్, ధోని నరేందర్, రావుల లింగస్వామి, రామగోని రాజు, సాంబార్ ధర్మయ్య, ధోని కుమార్, రవి, సత్యం తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి

**పర్వతగిరి/ డిసెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యు) నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పర్వతగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యుడు భాషిపాక రమేష్, వరంగల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బల్సుకూరి నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేల జీవనభృతి, ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు నెలకు రూ.4 వేల పింఛను, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు రూ.12 వేల సాయం వంటి హామీలను





అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వైద్యం, నిరుద్యోగ భృతి తదితర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రోగులకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించి హామీలను అమలు చేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి మహ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షత వహించగా, డిప్యూటీ తహసీల్దార్ నయూబ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు గొనె రామచందర్, జక్క అశోక్, సోమిడి రవి, దత్తు దుడయ్య, రౌతు శ్రీనివాస్, ముడిదె రమేష్, గడ్డం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త

గురువారం 1 అక్టోబర్ 2026

# ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన





**వర్ధన్నపేట/ సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో నెలకొన్న ఏలినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు వర్ధన్నపేట రైతు వేదికలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ఆదేశాల మేరకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. పేద వర్గాలకు ఉపాధి కల్పించేందుకు వీబీజీ రామ్‌జీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2న గ్రామసభలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించాలని సర్పంచ్‌లకు సూచించారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గ్రామసభల్లో గుర్తించి, వాటికి సభ ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ పీ ఓ నాగేష్, సర్పంచ్ లు అధికారులు తదితరులు ఉన్నారు

# యాసంగికి వేలేరుకు గోదావరి జలాలు

## గండి రామారం లిఫ్ట్-1 పనులు పూర్తి చేస్తాం -ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**వేలేరు/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** గండి రామారం ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగి పంటల నాటికి వేలేరు మండలానికి గోదావరి జలాలను తీసుకొచ్చి సాగునీరు అందిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. వేలేరు రైతువేదికలో బుధవారం కల్యాణలక్ష్మిషాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా నలుగురు కల్యాణలక్ష్మిషాదీముబారక్ లబ్ధిదారులకు రూ.4,00,464, తొమ్మిది మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.3,49,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

**దాడిలో గాయపడిన కాంగ్రెస్ నేతకు పరామర్శ**

ఇటీవల దుండగుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వేలేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌ను కడియం శ్రీహరి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని చెప్పారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.పీచర గ్రామానికి చెందిన శివరాత్రి వెంకటలక్ష్మి, ధర్మసాగర్ మండలం నారాయణగిరికి చెందిన పింగిలి మణెమ్మ కుటుంబాలను పరామర్శించి వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

**పథకాలు ఇంటింటికీ**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరుతున్నాయని కడియం శ్రీహరి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతుభరోసా కింద రూ.7,800 కోట్లను 75 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.రాష్ట్రంలో తొలి ఏడాది 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, రెండో ఏడాది 2.50 లక్షల ఇళ్లతో మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ప్రభుత్వ భూములు పంచాలి



**పర్వతగిరి/ సెప్టెంబరు 30 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జన్ను నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోపనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమం సర్పంచి నాంపల్లి విజయ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరువు, కుంటల పరిధిలోని భూములను పరిరక్షించడంతోపాటు ప్రభుత్వ భూములను గుర్తించి నిరుపేదలకు అందించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# నరసయ్య మాదిగ కుటుంబానికి పరామర్శ



**వర్ధన్నపేట/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** నల్లవెల్లి గ్రామానికి చెందిన బిర్రు నరసయ్య మాదిగ మృతి చెందడంతో కుటుంబ సభ్యులను ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట ఎంఈఎఫ్ జిల్లా నాయకులు, ఆర్టీసీ డ్రైవర్ బిర్రు కొర్నేలు మాదిగ, ఎంఎస్పీ వర్ధన్నపేట మాజీ మండల అధికార ప్రతినిధి బిర్రు బిక్షపతి మాదిగ తదితరులు ఉన్నారు.

# మల్లికాంబకు నివాళి





**కొడకండ్ల/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన మద్దెల బిక్షపతి సతీమణి మద్దెల మల్లికాంబ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎం. మనోజ్‌గౌడ్ గ్రామానికి చేరుకుని మల్లికాంబ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లికాంబ మృతి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి చివరి వీడ్కోలు పలికారు. మండల, గ్రామ నాయకులు, బంధువులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను అమలు చేయాలి




**రాయపర్తి/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యు) రాయపర్తి మండల కార్యదర్శి గుగులోతు అరుణ్‌నాయక్ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం రాయపర్తి మండల కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అరుణ్‌నాయక్ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్లు పెంచడంతోపాటు మహిళలకు నెలకు రూ.2,500 అందించాలన్నారు. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు. ప్రభుత్వ భూములను పరిరక్షించి భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని, 60 గజాల ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూం ఇళు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేసి ప్రైవేటు వైద్య దోపిడీని నియంత్రించాలని, ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, ఉద్యోగాలు లభించే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి ఇవ్వాలని కోరారు. ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంద రవి, బత్తిని కుమారస్వామి, యాదగిరి, గజ్జల రాజు, గుగులోతు లాలునాయక్, గుగులోతు గణేష్, గుగులోతు సుమన్, బత్తిని ప్రశాంత్, బానోతు సోమన్న, లక్పతి తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుకల సందర్భంగా అన్నదానం



**పెనుగంచిప్రోలు/సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో గజ్జ శ్రీనివాసరావునాగజ్యోతి దంపతుల కుమార్తె గజ్జ హరిణి పుట్టినరోజు సందర్భంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగ పిల్లలకు భోజనం అందించారు.హరిణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన సేవాసదనం నిర్వాహకులు, ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మానసిక దివ్యాంగ పిల్లలకు అన్నదానం చేసిన శ్రీనివాసరావునాగజ్యోతి దంపతులకు కేంద్రం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరా గాంధీ భవన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య.





**బయ్యారం/,సెప్టెంబర్ 30.(జర్నలిస్ట్ వార్త)**ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య,కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ కలిసి న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ భవన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ స్మృతి మ్యూజియంలో భద్రపరిచిన అరుదైన ఛాయాచిత్రాలు,చారిత్రక వస్తువులు,ఆమె జ్ఞాపకాలను ఆసక్తిగా పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశాభివృద్ధికి చేసిన కృషి, ఆమె రాజకీయ ప్రస్థానం,వారు దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.ఇందిరా గాంధీ జీవిత విశేషాలను,చారిత్రక స్మృతులను భవిష్యత్ తరాలకు అందేలా భద్రపరచడం ఎంతగానో అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏఎంసి చైర్మన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.౦

# ఇల్లందు రైతాంగానికి త్వరలోనే తీపి కబురు

## -గోదావరి జలాలపై మంత్రి ఉత్తమ్‌తో ఎమ్మెల్యే కనకయ్య భేటీ.



**బయ్యారం/,సెప్టెంబర్ 30.(జర్నలిస్ట్ వార్త)**

ఇల్లందు నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక సాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య గారు వేగంగా పావులు కదుపుతున్నారు.ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న క్రమంలో ఆయన ఢిల్లీ విమానాశ్రయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ప్రత్యేకంగా కలిశారు.ఈ భేటీలో నియోజకవర్గానికి ఎంతో కీలకమైన సీతారామ ఎత్తిపోతల పథకం పనులతో పాటు బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి జలాలను తరలించే అంశంపై ఎమ్మెల్యే విస్తృతంగా చర్చించారు.బయ్యారం ప్రాంత రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి కష్టాలను,ప్రజల తాగునీటి అవసరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అత్యంత సానుకూలంగా స్పందించారు.బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి నీటిని తరలించే ప్రాజెక్టుపై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని,అతి త్వరలోనే ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు ఒక గొప్ప గుడ్‌న్యూస్ చెబుతాం“ అని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు,గంధంపల్లి కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.౦

# పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలి.

## -తహశీల్దార్ నాగరాజు.



**బయ్యారం/,సెప్టెంబర్ 30.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మండల అధికారులు పాల్గొని స్థానిక కాలనీ వాసులకు రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు,చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చప్పిడి నాగరాజు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తుంచుకోవాలని,వివక్ష లేని సమాజ నిర్మాణానికి పౌర హక్కుల పట్ల అవగాహన అవసరమని పేర్కొన్నారు.అనంతరం ఎస్ఐ ప్రశాంత్ బాబు మాట్లాడుతూ చట్టపరమైన రక్షణలు,శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్రను వివరిస్తూ,బాధితులకు ఎల్లప్పుడూ న్యాయం అందుతుందని తెలిపారు.౦

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

## -బీజేపీ నాయకుల డిమాండ్.



**బయ్యారం/,సెప్టెంబర్ 30.(జర్నలిస్ట్ వార్త)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజంలో విభేదాలు సృష్టించే విధంగా ఉన్నాయని బీజేపీ జిల్లా ఫైనాన్స్ సెల్ కన్వీనర్ తుమ్మల శ్రీనివాసరావు మండిపడ్డారు.శ్రీరాముడిని ధనికుల దేవుడిగా,పరమశివుడిని పేదల దేవుడిగా చిత్రీకరిస్తూ మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని ఆయన ఆక్షేపించారు. భగవంతుడి దృష్టిలో అందరూ సమానులేనని,దేవుళ్లను ధనిక,పేదలుగా విభజించడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు.బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు ప్రజల నమ్మకాలను,విశ్వాసాలను గౌరవించాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తుచేశారు.రేవంత్ రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని,హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా కమిటీ సభ్యులు నంబూరి రామకృష్ణ,మండల సహాయ కార్యదర్శులు దెరంగుల రాంబాబు,ఆడెపు జై ప్రసాద్,రేఖ ఉప్పలయ్య,ఓబీసీ మాజీ మండల అధ్యక్షుడు కురియాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్ వార్డెన్, జీపీఓ ప్రభాకర్,గ్రామ పంచాయతీ సిబ్బంది,పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## దేవరుప్పుల మండలంలోని పలు గ్రామాలను పర్యటించిన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి



**దేవరుప్పుల/ సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి బుధవారం సాయంత్రం దేవరుప్పుల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి, శస్త్రచికిత్స చేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఆర్థిక సాయం అందించారు. ధర్మాపురంలో దండు సోమయ్య మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముత్యాల లక్ష్మి శస్త్రచికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవరుప్పులలో తోటకూరి వెంకన్న తల్లి గుండె శస్త్రచికిత్స పరిస్థితిని తెలుసుకున్నారు. కారుపోతుల విజయ్ తండ్రి, ఉప్పుల నాగరాజు భార్య మృతికి సంతాపం తెలిపారు. రెడ్డిరాజుల రమేష్‌ను పరామర్శించారు. బొజ్జం సుధీర్ తండ్రి, భాషిపాక శోభన్ తల్లి మృతికి సంతాపం తెలిపారు.కామారెడ్డిగూడెంలో జిలకర కిషన్ భార్య మృతికి సంతాపం తెలిపిన ఆమె, చౌదూరులో మాజీ ఎంపీపీ ఇనుముల నర్సయ్య మృతికి సంతాపం తెలిపారు. ఆయా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు





**వర్ధన్నపేట/సెప్టెంబర్ 30(జర్నలిస్ట్ వార్త);** మండలంలోని ఇల్లంద కాకతీయ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. పల్లె దవాఖాన వైద్యుడు డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, వ్యాయామంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు గొడిశాల శ్రీనివాస్, ఏఎన్ఎంలు సరోజ, అపరంజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కథనం.. కదిలించింది!

## ఎస్సీ హాస్టల్లో అధికారుల తనిఖీ






ఎస్సీ హాస్టల్‌లో ఇదేం దుస్థితి!

ఒక్క వర్కర్‌తోనే నిర్వహణ.. అరటి పండ్లు, పెరుగు కోసం విద్యార్థుల పరుగులు

విరిగిన బాత్‌రూమ్ తలుపులు.. దోమల స్వైరవిహారం.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

పర్వతగిరి/ సెప్టెంబరు 29 (జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండలంలోని ఎస్సీ హాస్టల్‌లో సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో ఒక్క వర్కర్‌తోనే హాస్టల్ నిర్వహణ సాగుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. నిత్యావసరాల్లో భాగమైన అరటి పండ్లు, పెరుగు తెచ్చుకునేందుకు కూడా కిలోమీటరుకు పైగా నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లోని బాత్‌రూమ్ తలుపులు సగానికి పైగా విరిగిపోయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విద్యార్థులు వాపోతున్నారు. దోమల బెడదతో రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కలెక్టర్ రెండుసార్లు హాస్టల్‌ను సందర్శించినా, స్పెషల్ ఆఫీసర్, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని విద్యార్థులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు కళ్లు తెరిచి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిశీలించి, తగిన సిబ్బందిని నియమించడంతో పాటు బాత్‌రూమ్ తలుపులు, పారిశుధ్యం, దోమల నివారణ చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.




**కథనం కదిలించింది! ఎస్సీ హాస్టల్లో అధికారుల తనిఖీ**

**పర్వతగిరి/ సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** ఎస్సీ హాస్టల్లో ఇదేం దుస్థితి? అనే శీర్షికతో మంగళవారం జర్నలిస్ట్ వార్తలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. కథనంలో పేర్కొన్న అంశాల వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు డీఎస్సీడీవో ఎండీ హమీద్, ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవో కె.కృష్ణ బుధవారం సాయంత్రం 6.45 గంటలకు పర్వతగిరి ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేసి భోజన నాణ్యతను పరిశీలించారు. వంటగది, స్టోర్ రూమ్, లివింగ్ రూమ్‌లు, విద్యార్థుల చదువుకునే సమయాల నిర్వహణ, హాజరు తదితర రికార్డులను తనిఖీ చేశారు.జర్నలిస్ట్ వార్తలో వచ్చిన అంశాల నేపథ్యంలో హాస్టల్‌లో వాస్తవ పరిస్థితులను స్వయంగా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. తనిఖీలో గుర్తించిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.









## ఏటీఎం లావాదేవీల నుంచి ఎల్పీజీ సబ్సిడీ వరకు..

# అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్

**అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న పలు ఆర్థిక మార్పులు**

**రూ.2000 దాటిన వ్యాపార యూపీఐ లావాదేవీలపై కొత్త ఫ్రేమ్‌వర్క్**

**సబ్సిడీ ఎల్పీజీ సిలిండర్ కోసం బయోమెట్రిక్ ఆధార్ తప్పనిసరి**

**ఎస్‌బీఐ శాలరీ ఖాతాదారులకు ఏటీఎం ఉచిత లావాదేవీల పరిమితిలో కోత**

**పన్ను చెల్లింపుదారులకు గడువు పొడిగించిన సీబీడీటీ**

**సెప్టెంబర్ 30 (జర్నలిస్ట్ వార్త):** అక్టోబర్ నెల గురువారం నుంచి ప్రారంభం కానుండగా, సామాన్యుల ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపే పలు కీలక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. బ్యాంకింగ్, పన్నులు, పొదుపు పథకాలు, వంటగ్యాస్ వంటి అనేక రంగాల్లో ఈ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు, పన్ను చెల్లింపుదారులు ఈ కొత్త నియమాలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం.

**యూపీఐ, పన్నుల విధానాల్లో మార్పులు**



ఈ మార్పులలో ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)కి సంబంధించి కొత్త నిబంధన అమల్లోకి వస్తోంది. రూ.2,000 మించిన వ్యాపార (మర్చంట్) లావాదేవీలపై కొత్త 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) ఫ్రేమ్‌వర్క్‌ను వర్తింపజేయనున్నారు. అయితే, ఈ ఛార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయబోరని, వ్యక్తిగత లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టతనిచ్చారు. మరోవైపు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఊరట కల్పించింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను, ట్యాక్స్ ఆడిట్ రిపోర్ట్ దాఖలు గడువును అక్టోబర్ 21కి, ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) ఫైలింగ్ గడువును నవంబర్ 21కి పొడిగించింది.

**ఎల్పీజీ, ఎస్‌బీఐ ఏటీఎం నిబంధనలు**

గృహ వినియోగదారులకు సంబంధించి ఎల్పీజీ సిలిండర్ బుకింగ్‌లో కీలక మార్పు రాబోతోంది. అక్టోబర్ 1 నుంచి సబ్సిడీ ధరపై గ్యాస్ సిలిండర్ పొందాలంటే తప్పనిసరిగా బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారు మార్కెట్ ధరకు సిలిండర్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కూడా తన నిబంధనలను సవరించింది. శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో అందించే నెలవారీ ఉచిత లావాదేవీల సంఖ్యను 10 నుంచి 5కి తగ్గించింది. ఈ పరిమితి ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలు రెండింటికీ వర్తిస్తుంది. 'బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్' (బీఎస్‌బీడీ) ఖాతాలకు నెలకు నాలుగు ఉచిత నగదు విత్‌డ్రాలు కొనసాగుతాయి. ఆ తర్వాత చేసే ప్రతి విత్‌డ్రాపై రూ.15తో పాటు జీఎస్టీ విధిస్తారు.

**ఇతర కీలక మార్పులు**

వీటితో పాటు, ప్రవాస భారతీయుల నుంచి ఆస్తులు కొనుగోలు చేసేవారు టీడీఎస్ కోసం ప్రత్యేకంగా ాాచీ బదులు ాాచీ ఉపయోగించుకోవచ్చు. 'నేషనల్ పెన్షన్ సిస్టమ్' (ఎన్‌పీఎస్)లో కొత్తగా చేరేవారికి రూ.200 ఆన్‌బోర్డింగ్ ఛార్జీ అమల్లోకి వస్తుంది. కాగా, ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం అక్టోబర్ 5 నుంచి 7 వరకు జరగనుంది. వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని అక్టోబర్ 7న ప్రకటించనున్నారు. గత సమావేశంలో రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచిన విషయం తెలిసిందే.


